# సాక్షి చిత్తూరు

శుక్రవారం । 3 । జనవరి । 2025






## చివరిరోజు 163 మంది అర్హత

కానిస్టేబుల్ నియామకాల్లో భాగంగా మూడో రోజు నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షల్లో 163 ఎంపికయ్యారు. - 8లో



## ఒంటరి ఏనుగు బీభత్సం

బంగారుపాళెం మండలం వెలుతురుచేనులో టమాట, చెరుకు తోటలపై ఒంటరి ఏనుగు దాడి చేసి నష్టం కలిగించింది. - 8లో



## తిరుమలలో ఎర్రచందనం

తిరుమలలో ఓ కారులో 20 ఎర్రచందనం దుంగలను పట్టుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఫారెస్టు రేంజర్ తెలిపారు. - 8లో

## న్యూస్‌రీల్

### రామకుప్పం పీహెచ్‌సీ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ సుధారాణి

రామకుప్పం/కుప్పం: మండలకేంద్రం రామకుప్పం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.టి.సుధారాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పర్యటన ఉన్న నేపథ్యంలో వైద్యసిబ్బంది జాగ్రత్తగా ఉండాలన్నారు. విధినిర్వహణలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సరైన వైద్యం అందించడంతో పాటు మందులను పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణాధికారి వెంకటప్రసాద్, జిల్లా మలేరియా అధికారి అనిల్, వైద్యాధికారులు హరినాథ్ రెడ్డి, లోకేష్, దీప, మస్తాన్ బాషా, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

### ఒంటరిగా వెళ్లొద్దు



తెల్లనీళ్లపల్లె గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎఫ్‌బీఓ ప్రభాకర్

చౌడేపల్లె: మండలంలోని తెల్లనీళ్లపల్లె, పరిసర గ్రామాల ప్రజలు ఒంటరిగా పంటపొలాలు, అటవీ ప్రాంతాల్లోకి వెళ్లవద్దని అంటూ ఫారెస్ట్ ఎఫ్‌బీఓ ప్రభాకర్ సూచించారు. బుధవారం సాక్షి దినపత్రికలో 'తెల్లనీళ్లపల్లెలో చిరుత' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అటవీశాఖ అధికారులు ప్రజలతో తెల్లనీళ్లపల్లెలో సమావేశం నిర్వహించి చైతన్యం కల్పించారు. పంటపొలాల్లోకి, అటవీ ప్రాంతాల్లోకి ఒంటరిగా వెళ్లడం, పశువులు, మేకలు, గొర్రెలను తోలుకెళ్లరాదని హెచ్చరించారు. చిరుత కనిపిస్తే వెంటనే కేకలు పెట్టి శబ్దం చేయాలన్నారు. రాత్రి సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### నిధులు మంజూరు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయాల నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు జిల్లాలోని 31 ఎంఈఓ కార్యాలయాలకు నిధుల మంజూరుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేపట్టారు. ఒక్కో ఎంఈఓ కార్యాలయానికి రూ.1.30 లక్షల చొప్పున మొత్తం నాలుగు విడతల్లో నిధులు ఇవ్వనున్నారు. మొదటి విడతగా రూ.60 వేలు చొప్పున మంజూరు చేయనున్నారు. ఆ నిధులతో స్టేషనరీ, ఇంటర్నెట్, విద్యుత్ బిల్లులు, భవనాల మరమ్మతులు తదితర అవసరాలకు వినియోగించుకోవచ్చని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

### క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న ఎస్‌ఈ ఇస్మాయిల్‌అహ్మద్

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ బిల్లులపై ఈనెల నుంచి క్యూఆర్ కోడ్‌తో పాటు ఇస్తున్న నేపథ్యంలో వినియోగదారులకు అవగాహన కల్పించాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్‌అహ్మద్ తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో ఈఈ, డీఈలతో సమావేశం నిర్వహించారు. కరెంటు బిల్లులు చెల్లించడానికి క్యూలైన్‌లో వేచిచూసే పనిలేకుండా నూతన విధానం ప్రవేశ పెట్టారన్నారు. బిల్లులో క్యూఆర్ కోడ్ వస్తుందని, దాన్ని స్కాన్ చేసి చెల్లింపులు చేయవచ్చన్నారు. దీనిపై సిబ్బంది క్షేత్రస్థాయిలో వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. సీఎం పర్యటన సందర్భంగా ఈఈ, డీఈలకు డ్యూటీలు వేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఈఈలు మునిచంద్ర, సురేష్, శ్రీనివాసమూర్తి, వాసుదేవరెడ్డి, జగదీష్, అమర్‌బాబు డీఈలు తదితరుల పాల్గొన్నారు.

### 681 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ఈ నెల 2వ తేదీ వరకు 681 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తయినట్లు జాయింట్ కలెక్టర్ విద్యాధరి వెల్లడించారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 822 రెవెన్యూ గ్రామాలకు గానూ 681 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తి అయినట్లు చెప్పారు. మిగిలిన 141 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు 9,677 అర్జీలు అందగా, 226 అర్జీలు పరిష్కరించినట్లు జేసీ వెల్లడించారు.



# ఎరువు.. నాణ్యత కరువు..

లాభాపేక్షతో ఎరువుల వ్యాపారులు కల్తీ, నకిలీ మందులు విక్రయిస్తుండడంతో అన్నదాతలకు తీరని నష్టం వాటిల్లుతోంది. తనిఖీలు చేయాల్సిన అధికారులు వ్యాపారులతో కుమ్మక్కయ్యారు. దాడులు చేయడం ఆపేసి నాణ్యత లేని ఎరువులు, పురుగు నివారణ మందుల విక్రయాలను ప్రోత్సహిస్తున్నారు. ఇదే అదునుగా భావించి వ్యాపారులు మాయజాలం చేస్తున్నారు. దీనికితోడు ఎరువుల రేట్లు అధికంగా ఉండడంతో రైతులు కొనలేక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు.

- జిల్లాలో పలు దుకాణాల్లో ఎరువుల విక్రయాల్లో మోసాలు
- వ్యాపారుల మాయజాలం
- బస్తాపై రూ.30 నుంచి రూ.100 వరకు తేడా
- పనిచేయని ఎరువులు, పురుగు మందులు
- వ్యాపారులతో అధికారుల కుమ్మక్కు.. తనిఖీలు శూన్యం
- ఫిర్యాదు చేస్తే ఆధారాలు కావాలని యక్షప్రశ్నలు
- తమిళనాడు, కర్ణాటకకు వెళ్లి ఎరువులు, మందులను తెచ్చుకుంటున్న రైతులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): దేశానికి అన్నం పెట్టే అన్నదాత మనుగడను అటు ప్రభుత్వాలు, ఇటు ఎరువుల వ్యాపారులు ప్రశ్నార్థకం చేస్తున్నారు. జిల్లాలో పలుచోట్ల నాణ్యత లేని ఎరువులు రైతులను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. పలుచోట్ల నకిలీ ఎరువులు, పురుగు మందులతో ఉసురు తీస్తున్నాయి. బయో ఎరువుల్లో నాణ్యత కరువైంది. పంటల్లో నకిలీ ఎరువులు, మందులు వేసి దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతు భరోసా కేంద్రాల్లోనే ఎరువులు విక్రయించాల్సి ఉన్నా.. రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా కొన్ని మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. దీంతో రైతులు ప్రైవేటు ఎరువుల దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. అయితే వ్యాపారులు మందులు, ఎరువులను అధిక రేట్లకు విక్రయిస్తున్నా.. నియంత్రించాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. దీంతో ఎరువులు, పురుగు మందుల విషయంలో మాయాజాలం నడుస్తోంది.

**జిల్లాలో ఎరువుల స్టాక్ వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)**

| ఎరువు రకాలు | గోడౌన్ | హోల్‌సేల్ | రిటైల్ | సరఫరాలో |
|---|---|---|---|---|
| యూరియా | 319.600 | 285.205 | 3741.44 | 128.475 |
| డీఏపీ | 0.800 | 129.150 | 586.600 | 14.350 |
| ఎంఓపీ | 71.250 | 12.000 | 364.670 | 0.000 |
| ఎన్‌పీకేఎస్ | 582.050 | 24.150 | 2269.69 | 62.200 |
| ఎస్ఎస్‌పీ | 22.350 | 76.400 | 391.100 | 1.000 |
| కంపోస్ట్ | 12.300 | 0.000 | 0.000 | 0.000 |

**ఎరువు నిల్వలు..**

జిల్లావ్యాప్తంగా ఎరువుల దుకాణాలు 212 దాకా ఉన్నాయి. వీటిలో 6 హోల్‌సేల్ దుకాణాలు, 206 రిటైల్ దుకాణాలు ఉన్నాయి. అయితే కొన్ని కేంద్రాల్లో మాత్రమే ఎరువులు అందుబాటులో ఉన్నాయి. పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో పట్టణ ప్రాంతాలు, పక్క రాష్ట్రాలకు పరుగులు తీస్తున్నారు. ఇక కొన్ని దుకాణాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల్లో నాణ్యత కొరవడుతోందని, కల్తీ ఉన్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. పలు మండలాల్లోని వ్యవసాయశాఖ అధికారులు నెల మామూళ్లకు అలవాటు పడి తమకు అనుకూలంగా ఉన్న వ్యాపారుల వద్దే ఎరువులు, మందులు తీసుకోవాలని సిఫార్సు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈ విషయాన్ని ఆ శాఖలోని కొందరు అధికారులే బహిరంగంగా చెప్పడం విమర్శలకు తావిస్తోంది.

**అధిక రేట్లకు తోడు..**

జిల్లాలోని పలు దుకాణాల్లో విక్రయించే ఎరువులు, పురుగు మందులు నాణ్యత కొరవడినా.. రేట్ల విషయంలో మాత్రం తగ్గేదేలా అన్నట్టు ఉంది. ఎరువుల ధరలు రైతులను పిండి పిప్పిజేస్తున్నాయి. తమిళనాడుకు, జిల్లాలో విక్రయించే వాటికి రేట్లలో చాలా తేడాలు ఉన్నాయి. యూరియా బస్తాపై రూ.30 నుంచి రూ.50 వరకు తేడా ఉన్నాయి. అలాగే పిచికారీ మందులు కంపెనీ, పంటను బట్టి రూ.100 నుంచి రూ.200 వరకు తేడా ఉంటున్నాయని రైతులు చెబుతున్నారు. దీంతో పాటు విత్తనాలు సైతం నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నాయి. రేట్లు కూడా జిల్లాలో అమాంతంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే పలువురు రైతులు పక్క రాష్ట్రాల వైపు చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతుల మేలు చేసేలా చూడాలని పలువురు వేడుకుంటున్నారు.

**తనిఖీలు చేస్తే ఒట్టు..**

ఎరువులు, పురుగు మందులు, విత్తనాల విక్రయ కేంద్రాలపై వ్యవసాయ శాఖ అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారుల పోరు పడలేక తనిఖీల పేరుతో హడావుడి చేస్తున్నారు. రికార్డులు చూసి తనిఖీలు చేసినట్లు ఫొటోలతో సరి పెట్టుకుంటున్నారు. దీంతో కొందరు దుకాణాదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గతేడాది కాలంలో 4 హోల్‌సేల్ షాపులు, 186 రిటైల్ డీలర్లను తనిఖీ చేస్తే ఎలాంటి కేసులు నమోదు చేయకపోవడం గమనార్హం.

### నాణ్యత డొల్ల...?



రబీ సీజన్ కావడంతో ఓవైపు మామిడి పూత ఆరంభం, మరో వైపు వరి సాగు, ఇతరత్రా కూరగాయల పంటలు సాగవుతుంటాయి. ఇక వర్షాభావ పరిస్థితులు ఈ పంటలను సోకి ఎదుగుదల, దిగుబడిపై దెబ్బతీస్తుంటాయి. ఇలాంటి తరుణంలో పలు రకాల పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు రైతులకు అవసరమవుతాయి. కొంతమంది స్థానిక ప్రాంతాల్లో లభ్యమయ్యే వాటిని కొనుగోలు చేసి పిచికారీ చేస్తుంటారు. మరికొందరు ఇక్కడ విక్రయించే వాటిల్లో నాణ్యత లేదని.. పక్క రాష్ట్రాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. చిత్తూరు, గుడిపాల, జీడీనెల్లూరు, పూతలపట్టు రైతులు తమిళనాడులోని పొన్నై, వేలూరును ఆశ్రయిస్తున్నారు. ఎస్‌ఆర్‌పురం, పాలసముద్రం, కార్వేటినగరం రైతులు తమిళనాడులోని పళ్లిపట్టుకు వెళ్తున్నారు. యాదమరి, బంగారుపాళ్యం రైతులు తమిళనాడులోని పరదరామిలో కొనుగోలు చేసుకుంటున్నారు. పలమనేరు, వీకోట రైతులు తమిళనాడులోని గుడియాత్తం, కర్ణాటకలోని బేతమంగళం, కుప్పంలోని రైతులు తమిళనాడు సరిహద్దులోని ఎరువుల దుకాణాల్లో తెచ్చుకుంటున్నారు.

### రబీ సాగు చూస్తే..



జిల్లాలో రబీ సాధారణ విస్తీర్ణం 23,384 హెక్టార్లు ఉండగా 17,817 హెక్టార్ల వరకు పలు రకాల పంటలు సాగయ్యాయి. ఈ సీజనల్‌లో నీటి వసతిని బట్టి వరిపంటను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తారు. వరి సాధారణ విస్తీర్ణం 10,983 హెక్టార్లు ఉండగా.. 1,748 హెక్టార్ల వరకు సాగైంది. ఇంకా వరి నాట్లు విస్తారంగా పడుతున్నాయి. ఉలవలు 7422 హెక్టార్లకు గాను 13320 హెక్టార్లలో, వేరుశనగ 2818 హెక్టార్లకు గానూ 551 హెక్టార్లలో సాగు అయింది. అలాగే ఉద్యానశాఖ పంటలు 75754.18 హెక్టార్లు సాగులో ఉండగా మామిడి సాగు 1.50 లక్షల ఎకరాల్లో ఉంది. అరటి 812.40 హెక్టార్లు, నిమ్మ 96 హెక్టార్లు, జామ 204 హెక్టార్లు, బొప్పాయి 443 హెక్టార్లు, బీన్స్ 1161 హెక్టార్లు, టమాట 1452.86 హెక్టార్లు, మిరప 12.76 హెక్టార్లు సాగులోకి వచ్చింది. వీటికి వాతావరణ పరిస్థితుల కారణంగా తెగుళ్లు వ్యాపిస్తుంటాయి. పంట ఎదుగుదలకు ఎరువులు అవసరం. అయితే కొంతవరకు రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉండగా మిగిలిన ఎరువులు, పురుగు మందులు పట్టణ ప్రాంతాల్లోని ఫర్టిలైజర్స్ దుకాణాల్లో కొనుగోలు చేయాలి.

### తమిళనాడులో రేట్లు తక్కువ..



తమిళనాడులో అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉంటాయి. జిల్లాలో చాలావరకు లేకపోవడం, నాణ్యత ఉండకపోవడం వల్ల సరిహద్దు ప్రాంతాల్లోని తమిళనాడుకి వెళ్లాల్సి వస్తుంది. మాకు ఎక్కువ కావాల్సింది యూరియా, డీఏపీ, జింక్ సల్ఫేట్, పొటాషియం. అక్కడ డీఏపీ రూ.1450, యూరియా రూ.300 ధరలకే దొరుకుతుంది. అందువల్ల ఎక్కువమంది తమిళనాడుకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుంది.

– గోవింద మందడి, రైతు, కార్వేటినగరం

### ఇక్కడి మందులు పనిచేయవు



జిల్లాలోని డీలర్ల వద్ద విక్రయించే ఎరువులు, పురుగు మందులు పనిచేయడం లేదు. అందుకే తమిళనాడులోని వేలూరుకు వెళ్లి తెచ్చుకుంటా. అదే మాదిరిగానే గుమ్మడికాయ విత్తనాలు కేజీ రూ.300 ఇక్కడ, అదే వేలూరులో రూ.220కే ఇస్తున్నారు. విత్తనం కూడా క్వాలిటీగా ఉంది. ఇక్కడ షాపుల్లో ధరలు అరికట్టి.. పంటకు ఉపయోగ పడే మందులు అందుబాటులోకి తీసుకొస్తే బాగుంటుంది.

– బాబు నాయుడు, రైతు, చిత్తూరు



# నకిలీల పేరుతో ఏరివేతకు కుట్ర

కొత్త ఏడాదిలో కూటమి ప్రభుత్వం పింఛన్‌దారుల పొట్ట కొట్టేందుకు సిద్ధమైంది. ఈ ఆర్నెళ్ల పాలనా కాలంలో కొత్త పింఛన్లు ఇవ్వకపోగా.. ఉన్న పింఛన్లను నకిలీల పేరిట తొలగించేందుకు ఆదేశాలు ఇచ్చింది. ఇప్పటికే కొత్త పింఛన్లు మంజూరు చేయాలని వితంతువులు, దివ్యాంగులు ప్రతి సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి ఉన్నతాధికారులకు అర్జీలు అందజేస్తున్నారు. అయితే కూటమి సర్కారు మాత్రం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చే యోచనలో లేదని జిల్లాప్రజలే ఆరోపిస్తున్నారు.

### ఎన్నిసార్లు అడుక్కున్నా..



ఈయన పేరు నారాయణస్వామి నాయుడు. ఈయనది చిత్తూరు రూరల్ మండలం గాజులపల్లి. వయసు 74 ఏళ్లు. ఇతనికి ఇప్పటి వరకు వృద్ధాప్య పింఛన్ రాలేదు. చాలాసార్లు మండల అధికారులకు పింఛన్ మంజూరు చేయాలని వినతిపత్రం ఇచ్చాడు. కానీ ఎవరూ న్యాయం చేయలేదు. దీంతో గత ఏడాది డిసెంబర్ 9వ తేదీన తన మీద దయ చూపి వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చాడు. – నారాయణస్వామినాయుడు

- దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ల జారీ నిలిపివేత
- కొత్త పింఛన్ల కోసం వితంతువులు, వృద్ధుల ఎదురుచూపులు
- నేటి నుంచి జిల్లాలో దివ్యాంగ పింఛన్ల క్షేత్రస్థాయి పరిశీలన
- కొత్త పింఛన్లు ఇవ్వకుండా ఉన్నవి తొలగించేందుకు కూటమి సర్కారు సిద్ధం

చిత్తూరు కలెక్టరేట్: జిల్లావ్యాప్తంగా దివ్యాంగ పింఛన్ల తనిఖీకి అధికారులు సిద్ధమయ్యారు. నకిలీ ధ్రువపత్రాలతో కొందరు దివ్యాంగ పింఛన్లు పొందుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో వారిని గుర్తించి తొలగించేందుకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కులం, వర్గం, పార్టీ, ప్రాంతం అనే తేడా లేకుండా అర్హులందరికీ పింఛన్లు అందజేసింది.



పింఛను మంజూరు చేయాలని కలెక్టర్‌కు విన్నవిస్తున్న బాధితులు (ఫైల్)

**నూతన సంవత్సరం ఆరంభంలోనే కోతలు..**

దివ్యాంగ పింఛనుదారుల్లో అనర్హులను గుర్తించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి అధికారులు తనిఖీలు చేపట్టారు. ఇందులో అనర్హుల లెక్క తేల్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. తాజాగా జనవరి 3వ తేదీ నుంచి జిల్లాలో మంచానికే పరిమితమైన విభాగంలో రూ.15 వేలు, వైకల్య ధ్రువపత్రాలతో రూ.6 వేలు చొప్పన పింఛన్లు పొందుతున్న వారి పత్రాలు, వివరాలను సమగ్రంగా పరిశీలించి కోతలు వేయాలని భావిస్తోంది.

**ప్రస్తుతం 35,374 దివ్యాంగ పింఛన్లు**

చిత్తూరు జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం నెలకు 35,374 మంది దివ్యాంగులు పింఛన్ పొందుతున్నారు. వీరికి నెలకు రూ.21.31 కోట్లు ఖర్చు చేస్తున్నారు. వీరిలో పక్షవాతం, ప్రమాదాల బారిన పడి మంచానికే పరిమితమై రూ.15 వేలు పింఛను పొందేవారు 1,936 మంది ఉన్నారు. మిగిలిన దివ్యాంగులతో కలిపి ప్రతినెలా ప్రభుత్వం రూ.2.92 కోట్లు మంజూరు చేస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ అందజేశారు. గత ఐదేళ్లల్లో మంజూరు చేసిన పింఛన్లను తొలగించాలనే కుట్రతో కూటమి ప్రభుత్వం సిద్ధమైంది.

**పరిశీలన ఇలా..**

జిల్లాలో మంచానికే పరిమితమైన విభాగంలో పింఛను పొందుతున్న వారి ఇళ్లకు వైద్యులు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తారు. దీని కోసం ఇతర నియోజకవర్గాల్లో వైద్యులను నియమిస్తారు. వీరు పరిశీలన జరిపి సెర్ప్ రూపొందించిన యాప్‌లో వివరాలు నమోదు చేస్తారు. ఈ ప్రక్రియ జనవరి 3వ తేదీ నుంచి ప్రారంభమై నెలాఖరు నాటికి పూర్తవుతుంది. వైకల్య ధ్రువీకరణ పత్రాలతో నెలకు రూ.6 వేల పింఛను పొందుతున్న వారికి ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి సమీప ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైకల్య పరీక్షలు చేయనున్నారు. ఈ పరిశీలన ఈ ఏడాది మే నెల చివరి వరకు కొనసాగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

### వితంతు పింఛన్ ఎప్పుడిస్తారు ?



నాది ఎస్‌ఆర్ పురం మండలం 49 కొత్తపల్లి మిట్ట గ్రామం. నా భర్త అకస్మాత్తుగా మృతి చెందారు. ప్రభుత్వం అందించే వితంతు పింఛన్ కోసం మండల అధికారుల వద్దకు వెళ్లి అడిగితే ఎలాంటి సమాధానం చెప్పడం లేదు. అందువల్లే కలెక్టర్ కార్యాలయంలో వినతి ఇవ్వాల్సిన దుస్థితి వచ్చింది. వితంతు పింఛన్ మంజూరు చేసి న్యాయం చేయాలని అధికారులను వేడుకున్నాను.

– సుజాత, అర్జీదారురాలు, ఎస్ఆర్ పురం మండలం

**జిల్లా సమాచారం**

| | |
|---|---|
| జిల్లాలోని రెవెన్యూ గ్రామాలు | 822 |
| జిల్లాలోని గ్రామ పంచాయతీలు | 697 |
| జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాలు | 612 |
| జిల్లాలోని నగరపాలక, మున్సిపాలిటీలు | 05 |
| జిల్లాలోని జనాభా | 18.73 లక్షలు |
| పురుషుల జనాభా | 9.40 లక్షలు |
| మహిళల జనాభా | 9.33 లక్షలు |
| అర్బన్ జనాభా | 3.69 లక్షలు |
| రూరల్ జనాభా | 15.04 లక్షలు |
| జిల్లాలోని మొత్తం పింఛన్లు | 2,56,511 |
| దివ్యాంగ పింఛన్లు | 35,374 |

## దేవుడి మాన్యం కబ్జా



కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిలో కోళ్లఫారం పనులు చేపడుతున్న దృశ్యం

శ్రీరంగరాజపురం: మండలంలోని అధికార పార్టీకి చెందిన ఓ నేత ప్రభుత్వ భూమితో పాటు దేవుడి మాన్యం భూమిని ఆక్రమించి కోళ్లఫారం నిర్మిస్తున్నాడని రెవెన్యూ అధికారులకు పిల్లిగుండ్లపల్లి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. వివరాలు.. బుధవారం కటికపల్లెలో జరిగిన రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పిల్లిగుండ్లపల్లికి చెందిన గ్రామస్తులు మాట్లాడుతూ కటికపల్లి రెవెన్యూ లెక్కదాఖలాలోని సర్వే నంబర్ 223/1లో 1.47 ఎకరాల స్థలం విఘ్నేశ్వరుడి ఆలయ మాన్యం భూమి అనాదీనం అని ఉందన్నారు. ఈ భూమిని తమ గ్రామానికి చెందిన హేమాద్రినాయుడు నకిలీ పట్టాలను సృష్టించి ఆక్రమించుకున్నాడని తెలిపారు. కానీ ప్రభుత్వ రికార్డుల్లో ఎక్కడా అతనికి డీకేటీ పట్టా ఇచ్చినట్లు లేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గుట్ట పొరంబోకు స్థలాలు, కట్టువ స్థలాలు.. ఇలా ఏదీ వదలకుండా కబ్జా చేస్తున్నాడని ఆరోపించారు. పెద్దపెద్ద చెట్లను కూడా కొట్టేసి చదును చేసుకుని కోళ్లఫారం నిర్మిస్తున్నా రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అందుకే కటికపల్లిలో జరిగిన రెవెన్యూ సభలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. వెంటనే దేవుడి మాణ్యం భూమి, ప్రభుత్వ స్థలాన్ని స్వాదీనం చేసుకుని రక్షించాలని డిమాండ్ చేశారు.

## క్లుప్తంగా

### ఇన్ని కోట్ల ఆస్తి ఎలా వచ్చింది?

**అవినీతి లేకుండా ఇది సాధ్యమా**
**మాజీ మంత్రి ఆర్కే రోజా**



ఆర్కే రోజా

**నగరి:** రెండు ఎకరాల ఆసామి కొడుకైన సీఎం చంద్రబాబు రూ.931 కోట్ల ఆస్తి ఎలా సంపాదించారు? అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్కే రోజా ప్రశ్నించారు. దేశంలో అత్యంత ఆస్తి కలిగి రూ.1000 కోట్ల చేరువలో ముఖ్యమంత్రిగా ప్రథమ స్థానంలో చంద్రబాబు నాయుడు ఉన్నట్లు ఏడీఆర్ రిపోర్ట్ రావడంపై గురువారం ఎక్స్ వేదికగా ఆమె స్పందించారు. ఇన్ని కోట్ల రూపాయల ఆస్తి ఆయనకు ఎలా వచ్చిందని, ఎలాంటి అవినీతి లేకుండా రెండు ఎకరాల ఆసామి కుమారుడికి ఇంత సంపాదన వచ్చిందంటే అది నమ్మశక్యమా..? అని ఆమె ప్రశ్నించారు.

### రెండు మండలాలకు ఇన్‌చార్జ్ తహసీల్దార్లు

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలోని రెండు మండలాలకు ఇన్‌చార్జ్ తహసీల్దార్లను నియమిస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల జిల్లా కేంద్రంలో గంగవరం ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివకుమార్, పెద్దపంజాణి ఇన్‌చార్జ్ తహసీల్దార్ ప్రసన్న కుమార్ తప్పతాగి వీధి రౌడీల్లా దాడి చేసిన విషయం విదితమే. ఈ ఘటన పత్రికల్లో ప్రచురితం కావడంతో పాటు సామాజిక మాధ్యమాల్లో వీడియోలు వైరల్ అయ్యాయి. దీంతో ఆ ఇద్దరిని అదనపు బాధ్యతల నుంచి తప్పించి కలెక్టర్ సస్పెండ్ చేశారు. ప్రస్తుతం వారి స్థానంలో బైరెడ్డిపల్లి తహసీల్దార్ మాధవరాజును గంగవరం ఇన్‌చార్జ్‌గా, పలమనేరు తహసీల్దార్ ఇన్బనాథన్‌ను పెద్దపంజాణి మండల ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

### పేకాట స్థావరాలపై దాడులు

**యాదమరి(కాణిపాకం):** పేకాట స్థావరాలపై యాదమరి పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. యాదమరి మండలం జంగాలపల్లి పరిసర ప్రాంతాల్లో దాడులు చేపట్టగా నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. వారి నుంచి రూ.5820 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

### శ్రీవారి సర్వ దర్శనానికి 8 గంటలు

**తిరుమల:** శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 3 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 69,630 మంది స్వామివారిని దర్శించుకోగా 18,965 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.13 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

# స్కాన్ చెయ్.. బిల్ కట్టెయ్..

కరెంటు బిల్లుల చెల్లింపులకు విద్యుత్ శాఖ నూతన ప్రవేశ పెట్టిన నూతన విధానం సత్ఫలితాలు ఇవ్వడంతో ఇప్పుడు జిల్లాలో అమలుకు శ్రీకారం చుట్టింది. బిల్లుల చెల్లింపులను మరింత సులభతరం చేసేందుకు కరెంట్ బిల్లుపైనే క్యూఆర్ కోడ్‌ను ముద్రించి ప్రత్యేక డిజిటల్ విధానాన్ని రూపొందించింది. ఆ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం చేస్తే సులువుగా బిల్ కట్టవచ్చని, అధికారులు చెబుతున్నారు. కొత్త సంవత్సరంలో జనవరి నెల నుంచే చిత్తూరు జిల్లాలో ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నారు. హెచ్‌టీ సర్వీసులు మినహాయించి బకాయిలు లేని మిగిలిన సర్వీసుదారులకు స్కాన్ ద్వారా బిల్లు కట్టే అవకాశం కల్పించారు.

- సత్ఫలితాలు ఇస్తున్న నూతన డిజిటల్ విధానం
- విద్యుత్ బిల్లుల చెల్లింపునకు ఆర్నెళ్లుగా ఆగిన యూపీఐ సేవలు
- తిరుపతిలో విజయవంతం కావడంతో చిత్తూరులో అమలుకు శ్రీకారం
- బిల్‌పైనే క్యూఆర్ కోడ్ ముద్రణ
- ఈ నెల నుంచి జిల్లాలో అమలు చేయనున్న విద్యుత్‌శాఖ

SCAN & PAY

**చిత్తూరు కార్పొరేషన్:** కరెంట్ బిల్లుల చెల్లింపునకు విద్యుత్‌శాఖ కొత్తగా ప్రవేశ పెట్టిన డిజిటల్ విధానం తిరుపతిలో పైలట్ ప్రాజెక్టు విజయవంతం కావడంతో ఈ నెల నుంచి చిత్తూరు జిల్లాలో అమలు చేసేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. గతేడాది జూన్ వరకు యూపీఐ సర్వీస్ ప్రొవైడర్లుగా ఉన్న గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం, అమెజాన్ తదితర యాప్స్ ద్వారా కరెంట్ బిల్లులు చెల్లించడానికి వెసులుబాటు ఉండేది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాలతో విద్యుత్ సంస్థలు ఆ ప్లాట్‌ఫాం సేవలు నిలిచిపోయాయి. ఈ పద్ధతి అమల్లో ఉన్నప్పుడు విద్యుత్ బిల్లులు చెల్లించడానికి వినియోగదారులకు సులువుగా ఉండేది. అయితే ఆ సర్వీస్ ప్రొవైడర్ల నుంచి సకాలంలో సంస్థ ఖాతాలకు డబ్బు జమ అయ్యేది కాదు. దీనివల్ల డబ్బుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతేగాకుండా యూపీఐ సర్వీస్ ప్రొవైడర్లకు లావాదేవీల వల్ల ఎక్కువ ఆదాయం కూడా ఉండేది. ఉదాహరణకు విద్యుత్ వినియోగదారుడు యూపీఐ సర్వీస్ ప్రొవైడర్ ద్వారా బిల్లు చెల్లిస్తే అందులో ఓ కనెక్షన్‌కు రూ.2.50 కమీషన్ దక్కేది. మిగతా మొత్తం విద్యుత్‌శాఖకు అందేది. ఇందులో కూడా జాప్యం చేస్తున్న కారణంగానే ఆర్బీఐ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ రెండు కారణాల వల్లే యూపీఐ సర్వీస్ ప్రొవైడర్ల ద్వారా బిల్లులు చెల్లించే పద్ధతిని రద్దు చేశారు. ప్రత్యామ్నాయంగా విద్యుత్ బిల్లులను పాత పద్ధతిలోనే మీసేవా కేంద్రాలు, సంబంధిత సెక్షన్ కార్యాలయాల వద్ద విద్యుత్ బిల్లుల వసూలుకు కౌంటర్లు ఉన్నాయి. ఈ వెసులుబాటు ఉన్నప్పటికీ సెక్షన్ కార్యాలయాల వద్ద బిల్లులు చెల్లించడానికి బారులు తీరాల్సి వస్తోంది. ఇక్కడ అదనపు రుసుం చెల్లించాల్సిన అవసరం లేనప్పటికీ మీసేవా కేంద్రాల వద్ద మాత్రం సర్వీస్ చార్జ్ రూ.5 చెల్లించాల్సి ఉంటుంది.

| చిత్తూరు జిల్లా సర్వీసుల సమాచారం | |
|---|---|
| గృహ | 5,03,970 |
| వాణిజ్యం | 57,363 |
| పరిశ్రమలు | 12,074 |
| వాటర్‌వర్క్స్ | |
| వీధిపాలు | 19,335 |
| వ్యవసాయం | 1,59,462 |
| మొత్తం | 7,52,204 |

**ఈ నెల నుంచి జిల్లాలో అమలు**

క్యూఆర్ కోడ్ విద్యుత్ బిల్లుల విధానాన్ని మొదటగా పైలట్ ప్రాజెక్టుగా తిరుపతి నగరంలో ప్రవేశపెట్టారు. అక్కడ ఫలితాలు విజయవంతంగా వచ్చాయి. దీంతో చిత్తూరు జిల్లాలో జనవరి నుంచి స్కాన్ బిల్లులు అందించడానికి చర్యలు తీసుకున్నాం. జిల్లాలోని వినియోగదారులకు క్యూఆర్ కోడ్‌తో విద్యుత్ బిల్లు వస్తుంది.

– ఇస్మాయిల్‌అహ్మద్, ఎస్ఈ ట్రాన్స్‌కో

**పైలట్ ప్రాజెక్టు విజయవంతం**

విద్యుత్ బిల్లుల చెల్లింపు ప్రక్రియను సరళతరం చేయాలని విద్యుత్‌శాఖ నిర్ణయించింది. ఈక్రమంలో తిరుపతి నగరంలో ప్రయోగాత్మకంగా డిసెంబర్ నుంచి కరెంట్ బిల్లుల పైభాగంలో క్యూఆర్ కోడ్‌ను ముద్రించారు. అక్కడ ఈ విధానం ద్వారా చెల్లింపులు బాగా జరిగాయని అధికారులు అంటున్నారు. తిరుపతి ఫలితాలతో చిత్తూరు జిల్లాలో జనవరి బిల్లులో క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా బిల్లు చెల్లింపును ప్రవేశ పెట్టనున్నారు. ఈ విధానం తెలంగాణలోని కొన్ని జిల్లాలో అమలు చేస్తున్నారు. అలాగే జిల్లా ప్రజలు విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు సంబంధిత ఈఆర్వో కార్యాలయాల వద్ద అధిక సంఖ్యలో చెల్లిస్తున్నారు. వీటితో పాటు సబ్‌ఈఆర్వో, సెక్షన్ కార్యాలయాల వద్ద వసూలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

### ఒంటరి ఏనుగు బీభత్సం



బంగారుపాళెం:వెలుతురుచేనులో టమాటా పంటను తొక్కేసిన ఏనుగు

**బంగారుపాళెం:** మండలంలోని వెలుతురుచేనులో ఒంటరి ఏనుగు పంటలను ధ్వంసం చేసింది. గ్రామానికి చెందిన శ్రీనివాసులు సాగుచేసిన టమాటా, చెరుకు పంటలను బుధవారం రాత్రి ధ్వంసం చేసిందని బాధిత రైతు వాపోయాడు. ఏనుగు దాడి గురించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పరిహారం చెల్లించేందుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామన్నారు. డిసెంబరు నెలలో కూడా ఏనుగులు పంటలపై దాడి చేశాయని పలువురు రైతులు తెలిపారు. ఒంటరి ఏనుగు మండలంలోని సామచేనుమిట్ట వద్ద ఓ ఇంటిని ధ్వంసం చేసిన విషయం తెలిసిందేనన్నారు. పంట పొలాలపైకి ఏనుగులు రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని అటవీశాఖ అధికారులను కోరారు.

ఆస్తులు.. అంతస్తులు వద్దు..

# బతకనిస్తే చాలు

- పోలీసులను ఆశ్రయించిన వృద్ధ దంపతులు
- కొడుకు, కోడలి ఆగడాలపై ఫిర్యాదు
- రక్షణ కల్పించాలని వేడుకోలు



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన రాజమ్మ

**చౌడేపల్లి:** ''ఆస్తులు.. అంతస్తులు ఏమీ వద్దు.. ప్రశాంతంగా మమ్మల్ని బతకనిస్తే చాలు దేవుడా'' అంటూ వృద్ధ దంపతులు చౌడేపల్లె పోలీసులకు బుధవారం మొరపెట్టుకున్న ఘటన బుధవారం వెలుగు చూసింది. బాధితుల కథనం మేరకు వివరాలిలా.. ఏ.కొత్తకోట పంచాయతీ అంకుతోటపల్లెకు చెందిన చిన్నపరెడ్డి(90) రాజమ్మ(85) వృద్ధ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. కుమార్తెలు ముగ్గురికీ వివాహం చేసి పంపారు. కుమారుడు మనోహర్ స్వగ్రామమైన అంకుతోటపల్లెలోనే నివాసం ఉంటున్నాడు. అయితే తల్లిదండ్రుల పేరిట ఉన్న ఆస్తిని మనోహర్ తన పేరిట మార్చుకుని వారిని పట్టించుకోవడం లేదు. దీనిపై వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుమారుడితో పాటు కోడలు సరస్వతమ్మ తమపై దాడి చేయడంతో పాటు దుర్భాషలాడుతోందని పోలీసుల ఎదుట వాపోయారు. నిత్యం నరకయాతన పడుతున్నామని, తినడానికి కూడా కష్టంగా మారిందని, కుమారుడు, కోడలి వేధింపులు తట్టుకోలేక పోతున్నామని, రక్షణ కల్పించి న్యాయం చేయాలని పోలీసులను వేడుకున్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులపై దాడి చేయడంతో పాటు తిండి కూడా పెట్టని వారి కుమారుడు మనోహర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండు చేశారు.

## స్టాఫ్ నర్సు పోస్టులకు దరఖాస్తులు

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** కడప జోన్–4 పరిధిలో 150 స్టాఫ్ నర్సు పోస్టులకు కాంట్రాక్ట్ పద్ధతిలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి దరఖాస్తులు స్వీకరణ ప్రారంభమై..ఈనెల 17వ తేదీతో ముగుస్తుందన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు ఫారం పూర్తి చేసి కడపలోని ప్రాంతీయ సంచాలకుల కార్యాలయానికి సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు www.cfw.a p.gov.inను సంప్రదించాలన్నారు.

### ఉద్యోగుల హామీలపై చర్చించరా ?



మాట్లాడుతున్న ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ

**చిత్తూరు కలెక్టరేట్ :** రాష్ట్ర ప్రభుత్వం కేబినేట్ సమావేశంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలపై చర్చించకపోవడం బాధాకరమని ఆపస్ (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం) రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు కూటమి ప్రభుత్వంపై ఆర్థిక బకాయిలు, కరువు భత్యం (డీఏ), 12వ వేతన సవరణ (పీఆర్‌సీ), మధ్యంతర భృతి (ఐఆర్) సకాలంలో చెల్లిస్తారని ఆశలు పెట్టుకున్నారన్నారు. అయితే ఈ నెల 2వ తేదీ నిర్వహించిన కేబినేట్ సమావేశంలో ఉద్యోగులకు సంబంధించి ఎలాంటి అంశాలు చర్చించకపోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఇంత వరకు రూ.25 వేల కోట్ల ఆర్థిక బకాయిలు విడుదల చేయకపోవడం అన్యాయమని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వెంటనే సంక్రాంతి కానుకగా 30 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

## చివరిరోజు 163 మంది అర్హత

- నేడు మహిళా అభ్యర్థులకు పరీక్షలు



ఈవెంట్స్‌లో పాల్గొంటున్న అభ్యర్థులు

**చిత్తూరు అర్బన్:** చిత్తూరులో జరుగుతున్న కానిస్టేబుల్ పోస్టులకు సంబంధించిన దేహదారుఢ్య పరీక్షల్లో గురువారం 159 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. చిత్తూరు ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులకు జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో జరుగుతున్న దేహదారుఢ్య పరీక్షలను (ఈవెంట్స్)ను ఎస్పీ మణికంఠ పర్యవేక్షించారు. మొత్తం 599 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా.. 394 మంది హాజరయ్యారు. వీళ్లల్లో 163 మంది తదుపరి రాత పరీక్షకు అర్హత సాధించారు. గత మూడు రోజులుగా జరుగుతున్న ఈవెంట్స్‌లో 1799 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 1173 మంది హాజరయ్యారు. వీరిలో 477 మంది మాత్రమే ఈవెంట్స్‌లో అర్హత సాధించి, రాత పరీక్షలకు ఎంపికవడం గమనార్హం. మరోవైపు మహిళా అభ్యర్థులకు శుక్రవారం ఈవెంట్స్ నిర్వహించనున్నారు. ఇందుకోసం మహిళా డీఎస్పీతో పాటు సీఐ, అయిదుగురు మహిళా ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులను నియమించారు. మహిళలకు ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉంటే ముందుగా తమ దృష్టికి తీసుకొస్తే, ఈవెంట్స్ తేదీని మార్చడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

## జాతీయ స్థాయి త్రోబాల్ జట్టుకు నిత్యశ్రీ

**కుప్పంరూరల్:** గుంటూరులో జరిగిన అండర్–17 బాలికల స్కూల్ గేమ్స్ త్రోబాల్ విభాగంలో కుప్పం మండలం టి.సదుమూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎ.నిత్యశ్రీ చిత్తూరు జిల్లా జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించింది. ఈ పోటీల్లో చిత్తూరు జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఎ.నిత్యశ్రీ జాతీయ జట్టుకు ఎంపికైంది. గురువారం పాఠశాలలో విద్యార్థినిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. హెచ్‌ఎం పద్మనాభరాజు ఎ.నిత్యశ్రీ, ఆమెకు సహకరించిన ఫిజికల్ డైరెక్టర్ ప్రకాశ్‌ను ప్రశంసించారు.



విద్యార్థిని నిత్యశ్రీతో పాఠశాల ఉపాధ్యాయ బృందం



# మామిడి రైతుల్లో ఆందోళన వద్దు

- జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి



మధుసూదన్‌రెడ్డి

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** వాతావరణ పరిస్థితుల కారణంగా మామిడి పూత ఆలస్యమవుతోందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో ఆయన గురువారం పూత ఆలస్యాన్ని ఉద్దేశించి సాక్షితో మాట్లాడారు. వాతావరణ పరిస్థితులు మామిడి పూతను కుంగదీస్తోందని, కురుస్తున్న వర్షాలు, కారు మబ్బులు కమ్మి మామిడి పూతకు అడ్డు పడుతున్నాయన్నారు. దీని కారణంగానే మామిడిపూత రావడం ఆలస్యమవుతోందని, ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గతరెండు రోజులుగా ఎండలు కాస్తున్నాయని తెలిపారు. ఈ ఎండలు వారం రోజుల పాటు ఉంటే కచ్చితంగా పూత వచ్చేస్తుందన్నారు. అయితే పూత వచ్చే సమయానికి ఇష్టానుసారంగా మందులు పిచికారీ చేయవద్దన్నారు. అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ఇష్టానుసారంగా మందులు పిచికారీ చేస్తే..పంట దిగుబడిపై ప్రభావం ఉంటుందన్నారు. ఈసారి కురిసిన వర్షాల కారణంగా దిగుబడి అధికంగా ఉండవచ్చని భావిస్తున్నామని తెలిపారు. మొగ్గ దశలో తేనెమంచు పురుగులు, కస్నుు తెగులు, బూడిద తెగులు ఆశిస్తాయన్నారు. వీటి నివారణకు క్లోరోపైరిపాస్, వేపనూనె తగిన మోతాదులో తీసుకుని నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు.

## వైకుంఠ ఏకాదశికి ముమ్మర ఏర్పాట్లు



వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై సమీక్షిస్తున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

**తిరుపతి రూరల్:** వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తుమ్మలగుంట కల్యాణ వెంకన్న ఆలయంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సూచించారు. ఈ నెల 10న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లపై గురువారం ఈవో, సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి నాడు ఉదయం 3.30 గంటల నుంచే వైకుంఠ ద్వారం ప్రారంభించనున్నట్లు తెలిపారు. తుమ్మలగుంట గ్రామ శివార్లలో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు.

**నిరంతరాయంగా అన్న ప్రసాదాల పంపిణీ**

వైకుంఠ ఏకాదశి పర్వదినాన ఉదయం 6 నుంచి రాత్రి 12 గంటల వరకు నిరంతరాయంగా అన్న ప్రసాదాలు పంపిణీ చేయాలని ఆలయ అధికారులను ఆదేశించారు.

## హౌసింగ్ ఇన్‌చార్జ్ పీడీగా గోపాల్ నాయక్



బాధ్యతలు స్వీకరించిన గోపాల్‌నాయక్‌ను కలిసిన పలువురు సిబ్బంది

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లా గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జ్ పీడీగా గోపాల్‌నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఆయన కలెక్టరేట్‌లోని జిల్లా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో పీడీగా పనిచేస్తున్న పద్మనాభం విజయవాడకు బదిలీ అయ్యారు. కాగా జిల్లా రెగ్యులర్ పీడీగా ఎవరినీ నియమించకపోవడంతో నగరి ఈఈ (ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్)గా పనిచేస్తున్న గోపాల్ నాయక్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయనను జిల్లాలోని హౌసింగ్ శాఖ డీఈ, ఏఈ, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సత్కరించారు.

## రీసోర్స్ పర్సన్ పోస్టుల భర్తీపై సమీక్ష



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న సైనిక సంక్షేమ శాఖ, రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగుల అసోషియేషన్ నాయకులు

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలో సీడాప్ (సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మండల స్థాయి రీసోర్స్ పర్సన్ ఎంపికలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ పథకం (పీఎంఎఫ్ఎంఈ) అమలు చేసేందుకు ప్రతి మండలంలో రీసోర్స్‌పర్సన్లను నియమించనున్నట్లు తెలిపారు. రీసోర్స్‌పర్సన్లుగా పనిచేసేందుకు ఏదైనా డిగ్రీ పూర్తి చేసి, 21–30 ఏళ్ల మధ్య వయస్సు గల పురుషులు, మహిళలు అర్హులన్నారు. ఎంపికయ్యే అభ్యర్థులు చక్కటి తెలుగు భాష, కంప్యూటర్ ఉపయోగించే విధానంతో పాటు, క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను మొబిలైజేషన్ చేసే సామర్థ్యం కలిగి ఉండాలన్నారు. అలాగే ఫుడ్ ప్రాసెసింగ్ రంగం, గ్రామీణాభివృద్ధి రంగంలో పనిచేసిన అనుభం ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తారన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకునే అభ్యర్థులకు రాతపరీక్ష నిర్వహించి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. వివరాలకు 9963561755, 9581041026, 9441872140 నంబర్లలో సంప్రదించాలని కలెక్టర్ వెల్లడించారు.

**మాజీ సైనికుల సమస్యలు పరిష్కరించండి**

జిల్లాలో మాజీ సైనికుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. ఈ మేరకు జిల్లా సైనిక సంక్షేమ శాఖ, రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగుల అసోషియేషన్ల ఆధ్వర్యంలో సైనిక్ వెల్ఫేర్ ఫండ్ చెక్కును కలెక్టర్‌కు అందజేశారు. ఈ మేరకు కలెక్టర్ మాట్లాడుతూ తమవంతు సాయంగా రూ.10,116 సైనిక్ వెల్ఫేర్ ఫండ్‌కు వితరణ చేయడం అభినందనీయమన్నారు. జిల్లాలోని వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు సాయుధ దళాల పతాకనిధికి తమవంతు సాయం అందజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి రాఘవులు, రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగుల అసోషియేషన్ అధ్యక్షుడు భవాని రెడ్డెప్ప, సెక్రటరీ రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఇరువర్గాల గొడవ



రాస్తారోకో చేస్తున్న ఒక వర్గం నాయకులు

**నగరి :** మండలంలోని తడుకుపేట గ్రామంలో సిమెంటురోడ్డుకు సంబంధించిన వ్యవహారం రెండు వర్గాల మధ్య గొడవకు దారితీసింది. ఈ గొడవలో పురుషోత్తం నాయుడు, రాజేష్ అనే ఇద్దరికి గాయాలు కాగా ఆ వర్గం వారు జాతీయ రహదారిపై బైటాయించి రాస్తారోకో చేశారు. దీంతో రోడ్డుపై వాహనాలు కిలోమీటరు మేర ఆగిపోయాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నిరసన కారులతో చర్చించారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన వారు వెనుదిరిగారు.

## ఇద్దరు ఎర్రస్మగ్లర్ల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

**తిరుపతి మంగళం :** శ్రీవారి మెట్టు సమీపంలో మూడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఇద్దరు స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి. శ్రీనివాస్, డీఎస్పీలు జి.బాలిరెడ్డి, వి.శ్రీనివాసరెడ్డి, ఎండీ షరీఫ్ నేతృత్వంలో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డి, ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్ కుమార్ బృందం గురువారం చంద్రగిరి మండలం, భాకరాపేట రేంజిలోని నాగపట్ల బీట్‌లో కూంబింగ్ చేపట్టారు. శ్రీవారిమెట్టుకు పడమర వైపునకు చేరుకునే సరికి ముగ్గురు స్మగ్లర్లు ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తూ కనిపించారు. వీరిని హెచ్చరించి చుట్టుముట్టే సరికి ఒక వ్యక్తి దుంగను పడేసి పారిపోగా, మిగిలిన ఇద్దరిని అరెస్టు చేశారు. వారు మోసుకొస్తున్న మూడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఫీ తెలిపారు.

## తిరుమలలో ఎర్రచందనం స్వాధీనం

**తిరుమల:** తిరుమలలో 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్ట్ చేసిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఫారెస్ట్ రేంజర్ సుదర్శన్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తిరుమలలోని శిలాతోరణం వద్ద ఓ కారు హల్‌చల్ చేసింది. వేగంగా వెళ్తున్న కారులో అక్రమంగా ఎర్రచందనం రవాణా అవుతున్నట్లు అటవీశాఖ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు కారును ఆపి తనిఖీలు చేపట్టారు. కారులోని వెనుక సీటులో గ్రేడ్ ఏకు చెందిన 20 ఎర్రచందనం దుంగలు లభ్యమయ్యాయి. డ్రైవర్ తప్పించుకునే ప్రయత్నం చేయగా.. సిబ్బంది అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఎర్రచందనం దుంగలతో పాటు కారును సీజ్ చేశారు. స్మగ్లర్ తమిళనాడు వెన్నుపూరానికి చెందిన రమేష్‌గా గుర్తించారు.